28-02-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - శివ జయంతియే గీతా జయంతి అని, గీత ద్వారా మళ్ళీ శ్రీకృష్ణ జయంతి జరుగుతుంది అని భారతవాసులకు నిరూపించి చెప్పండి"

ప్రశ్న:- ఏ ధర్మ స్థాపనకైనా ముఖ్యమైన ఆధారము ఏమిటి? ధర్మ స్థాపకులు తండ్రి చేసే ఏ కార్యాన్ని చేయరు?

జవాబు:- ఏ ధర్మ స్థాపనకైనా పవిత్రతా బలము కావాలి. అన్ని ధర్మాలు పవిత్రతా బలముతో స్థాపనయ్యాయి. కానీ ఏ ధర్మస్థాపకుడూ ఎవ్వరినీ పావనంగా చేయరు ఎందుకంటే ధర్మాల స్థాపన జరిగినప్పుడు మాయా రాజ్యం ఉంటుంది, అందరూ పతితులుగా అవ్వవలసిందే. పతితులను పావనంగా చేయడము - ఇది తండ్రి పనే. వారే పావనంగా తయారయ్యేందుకు శ్రీమతాన్ని ఇస్తారు.

పాట:- ఈ పాపపు ప్రపంచం నుండి... (ఇస్ పాప్ కీ దునియా సే...)

ఓం శాంతి. పాప ప్రపంచము అని దేనిని అంటారు మరియు పుణ్య ప్రపంచము అనగా పావన ప్రపంచము అని దేనిని అంటారు అనేది ఇప్పుడు పిల్లలు అర్థం చేసుకున్నారు. వాస్తవానికి పాప ప్రపంచము ఈ భారత్ యే, భారత్ యే మళ్ళీ పుణ్య ప్రపంచముగా, స్వర్గముగా అవుతుంది. భారత్ యే స్వర్గముగా ఉండేది, భారత్ యే నరకముగా అయ్యింది ఎందుకంటే కామచితిపై కాలుతూ ఉంటారు. అక్కడ కామచితిపై ఎవ్వరూ కాలరు, అక్కడ కామచితి ఉండనే ఉండదు. సత్యయుగంలో కామచితి ఉంది అని కూడా అనరు. ఇవి అర్థం చేసుకోవలసిన విషయాలు కదా. మొట్టమొదట ప్రశ్న తలెత్తుతుంది. ఏ భారత్ అయితే పతితముగా, దుఃఖితముగా ఉందో, అదే భారత్ తప్పకుండా పావనముగా, సుఖమయంగా ఉండేది. ఆది సనాతన హిందూ ధర్మం ఉండేది అని అంటారు కూడా. వాస్తవానికి ఆది సనాతన అని దేనిని అంటారు. ఆది అనగా ఏమిటి మరియు సనాతన అనగా ఏమిటి? ఆది అనగా సత్యయుగము, మరి సత్యయుగములో ఎవరు ఉండేవారు? లక్ష్మీ-నారాయణులు ఉండేవారని అందరికీ తెలుసు. తప్పకుండా వారు కూడా ఎవరో ఒకరికి సంతానమై ఉంటారు, ఆ తర్వాతే సత్యయుగ యజమానులుగా అవుతారు. సత్యయుగాన్ని స్థాపన చేసేవారు పరమపిత పరమాత్మ, వారు వారి సంతానముగా ఉండేవారు. కానీ ఈ సమయంలో స్వయాన్ని వారి సంతానంగా భావించడం లేదు. ఒకవేళ సంతానముగా భావించినట్లయితే తండ్రి గురించి తెలిసి ఉంటుంది, కానీ వారికి తండ్రి గురించి తెలియనే తెలియదు. వాస్తవానికి హిందూ ధర్మము గీతలో లేదు. గీతలో భారత్ అన్న పేరు ఉంది. వారు హిందూ మహాసభ అని అంటారు. నిజానికి శ్రీమత్ భగవత్ గీత సర్వశాస్త్రమయి శిరోమణి. గీతా జయంతి కూడా జరుపుకోబడుతుంది, అలాగే శివజయంతి కూడా జరుపుకోబడుతుంది. శివజయంతి ఎప్పుడు జరిగింది, ఇది కూడా తెలియాలి. ఆ తర్వాత శ్రీకృష్ణ జయంతి ఉంటుంది. శివజయంతి తర్వాతనే గీతా జయంతి ఉంటుందని ఇప్పుడు పిల్లలైన మీరు తెలుసుకున్నారు. గీతా జయంతి తర్వాత శ్రీకృష్ణ జయంతి ఉంటుంది. గీతా జయంతి ద్వారానే దేవీ-దేవతా ధర్మము యొక్క స్థాపన జరుగుతుంది. అంతేకాక గీతా జయంతికి మహాభారతముతో కూడా సంబంధము ఉంది. అందులో యుద్ధము యొక్క విషయము వస్తుంది. యుద్ధమైదానంలో మూడు సైన్యాలు ఉన్నట్లుగా చూపిస్తారు. యాదవులు, కౌరవులు మరియు పాండవులను చూపిస్తారు. యాదవులు ముసలాలను తీస్తారు. అక్కడ మద్యం తాగి ముసలాలను తీసారు. ఇప్పుడు తప్పకుండా ఆ మిసైల్స్ కూడా వెలువడుతున్నాయని మీకు తెలుసు. వారు కూడా తమ కులాన్ని వినాశనం చేసుకునేందుకు ఒకరినొకరు బెదిరించుకుంటున్నారు. వారందరూ క్రిస్టియన్లు. వారే యూరప్ వాసీ యాదవులు. కావున ఒకటేమో, వారి సభ. వారి వినాశనం జరిగింది, పరస్పరం కొట్లాడుకొని మరణించారు. అందులో మొత్తం యూరప్ అంతా వచ్చేసింది. అందులో ఇస్లాములు, బౌద్ధులు, క్రిస్టియన్లు మొదలైనవారందరూ వచ్చేస్తారు. ఇక్కడేమో కౌరవులు మరియు పాండవులు ఉన్నారు. కౌరవులు కూడా వినాశనాన్ని పొందారు మరియు విజయము పాండవులకు లభించింది. ఇప్పుడు ప్రశ్న ఏమని తలెత్తుతుందంటే - సహజ యోగాన్ని మరియు సహజ జ్ఞానాన్ని నేర్పించి రాజులకే రాజులుగా తయారుచేసిన మరియు పవిత్ర ప్రపంచాన్ని స్థాపన చేసిన ఆ గీతా భగవంతుడు ఎవరు? శ్రీకృష్ణుడేమైనా వచ్చారా? కౌరవులైతే కలియుగంలో ఉన్నారు. కౌరవులు మరియు పాండవుల సమయంలో శ్రీకృష్ణుడు ఎలా రాగలరు? శ్రీకృష్ణ జయంతిని జరుపుకుంటారు. సత్యయుగ ఆదిలో 16 కళలు ఉంటాయి. శ్రీకృష్ణుని తర్వాత మళ్ళీ త్రేతాయుగంలో రామునికి 14 కళలు ఉంటాయి. శ్రీకృష్ణుడైతే యువరాజులకు కూడా యువరాజు. వికారీ యువరాజులు శ్రీకృష్ణుడిని పూజిస్తారు ఎందుకంటే - శ్రీకృష్ణుడు సత్యయుగ 16 కళల సంపూర్ణ యువరాజు అని మరియు తాము వికారులు అని వారికి తెలుసు. తప్పకుండా ఆ యువరాజులు కూడా ఇలానే అంటారు కదా. ఇప్పుడు

మళ్ళీ శివజయంతి కూడా ఉంది, మందిరాలు కూడా వారివే అన్నింటికన్నా పెద్దగా తయారుచేయబడి ఉన్నాయి. అది నిరాకారుడైన శివుని మందిరము. వారినే పరమపిత పరమాత్మ అని అంటారు. బ్రహ్మ, విష్ణు, శంకరులను కూడా దేవతలు అనే అంటారు.

శివజయంతి భారత్ లోనే జరుపుకోబడుతుంది. ఇప్పుడు శివజయంతి రానున్నది. శివుడినే జ్ఞానసాగరుడు అనగా సృష్టిని పావనంగా తయారుచేసే పరమపిత పరమాత్మ అని అంటారని నిరూపించి అర్థం చేయించాలి. గాంధీ కూడా గానం చేసేవారు, అప్పుడు శ్రీకృష్ణుడి పేరును ప్రస్తావించేవారు కాదు. ఇప్పుడు ప్రశ్న ఉత్పన్నమవుతుంది - శివ జయంతియే గీతా జయంతియా లేక శ్రీకృష్ణ జయంతియే గీతా జయంతియా? శ్రీకృష్ణ జయంతి అని సత్యయుగంలో అంటారు. శివుని జయంతి ఎప్పుడు జరిగింది అన్నది ఎవ్వరికీ తెలియదు. శివుడు నిరాకార పరమపిత పరమాత్మ. వారు సృష్టిని సంగమములో రచించారు. సత్యయుగంలో శ్రీకృష్ణుని రాజ్యం ఉండేది. కావున తప్పకుండా ముందు శివ జయంతియే ఉంటుంది. బ్రాహ్మణ కుల భూషణులైన పిల్లలెవరైతే సేవలో తత్పరులై ఉంటారో, వారు ఈ విషయాలను బుద్ధిలోకి తీసుకురావాలి - భారతవాసులకు శివ జయంతియే గీతా జయంతి అన్నది ఎలా నిరూపించి చెప్పాలి అని. ఆ తర్వాత గీత ద్వారా శ్రీకృష్ణ జయంతి జరుగుతుంది అనగా రాజులకే రాజు యొక్క జయంతి. శ్రీకృష్ణుడు పావన ప్రపంచము యొక్క రాజు. అక్కడ రాజరికము ఉంటుంది. అక్కడ శ్రీకృష్ణుడు జన్మించి గీతను గానం చేయలేదు, అంతేకాక సత్యయుగంలో మహాభారత యుద్ధము మొదలైనవి జరగవు. అది తప్పకుండా సంగమములోనే జరిగి ఉంటుంది. పిల్లలైన మీరు ఈ విషయాలపై బాగా అర్థం చేయించాలి.

పాండవులు మరియు కౌరవుల సభ ప్రసిద్ధమైనది. పాండవపతిగా శ్రీకృష్ణుడిని చూపిస్తారు. వారు సహజ జ్ఞానాన్ని మరియు సహజ రాజయోగాన్ని నేర్పించినట్లుగా భావిస్తారు. ఇప్పుడు వాస్తవానికి యుద్ధము యొక్క విషయమేదీ లేదు. విజయము పాండవులకే లభించింది, వారికి పరమపిత పరమాత్మ సహజ రాజయోగాన్ని నేర్పించారు. వారే 21 జన్మలు సూర్యవంశీయులుగా, చంద్రవంశీయులుగా అయ్యారు. కావున మొదట హిందూ మహాసభ వారికి అర్థం చేయించాలి. సభలైతే పేరేవి కూడా ఉన్నాయి - లోకసభ, రాజ్యసభ. ఈ హిందూ సభ ముఖ్యమైనది. యాదవులు, కౌరవులు మరియు పాండవులు అనే మూడు సేనలు గురించి చెప్తూ ఉంటారు మరియు అవి సంగమములోనే ఉండేవి. ఇప్పుడు సత్యయుగ స్థాపన జరుగుతోంది. శ్రీకృష్ణుని జన్మకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గీత తప్పకుండా సంగమములోనే గానం చేయబడింది. ఇప్పుడు సంగమములోకి ఎవరిని తీసుకురావాలి? శ్రీకృష్ణుడైతే రాలేరు. పావన ప్రపంచాన్ని వదిలి పతిత ప్రపంచంలోకి రావలసిన అవసరం వారికేముంది, అంతేకాక ఈ సమయములో శ్రీకృష్ణుడు లేరు కూడా. వారు ఇప్పుడు 84వ జన్మలో ఉన్నారని మీకు తెలుసు. కానీ కొందరు శ్రీకృష్ణుడు అంతటా వ్యాపించి ఉన్నారని, అతను సర్వవ్యాపి అని భావిస్తారు. శ్రీకృష్ణుని భక్తులు అంతా కృష్ణమయమే, శ్రీకృష్ణుడే ఈ రూపాలన్నింటినీ ధరించారు అని అంటారు. రాధ భక్తులు అంతా రాధామయమే... నేనూ రాధనే, నీవూ రాధవే అని అంటారు. అనేక మతాలు వెలువడ్డాయి, కొందరు ఈశ్వరుడు సర్వవ్యాపి అని అంటే కొందరు శ్రీకృష్ణుడు సర్వవ్యాపి అని అంటారు, మరికొందరు రాధ సర్వవ్యాపి అని అంటారు. ఇప్పుడు తండ్రి పిల్లలైన మీకు అర్థం చేయిస్తారు. ఆ తండ్రి వరల్డ్ ఆల్మైటీ అథారిటీ కావున ఇప్పుడు పిల్లలైన మీకు కూడా - అందరికీ ఎలా అర్థం చేయించాలో ఆ అథారిటీని ఇస్తున్నారు. హిందూ మహాసభ వారికి అర్థం చేయించండి. వారు ఈ విషయాలను అర్థం చేసుకోగలరు. వారు తమను తాము ధార్మిక మనస్కులుగా భావిస్తారు. ప్రభుత్వమైతే ఏ ధర్మాన్ని అంగీకరించదు. వారు స్వయమే తికమక చెంది ఉన్నారు. శివ పరమాత్మ నిరాకారుడు, జ్ఞానసాగరుడు, ఇంకెవ్వరినీ అలా జ్ఞానసాగరుడు అని అనలేరు. వారు ఎప్పుడైతే సమ్ముఖముగా వచ్చి జ్ఞానాన్ని ఇస్తారో, అప్పుడే రాజ్య స్థాపన జరుగుతుంది. రాజ్య స్థాపన జరిగిపోయిందంటే మళ్ళీ ఎప్పుడైతే రాజ్యాన్ని పోగొట్టుకుంటారో, అప్పుడే సమ్ముఖముగా వస్తారు. కావున మీరు నిరూపించి చెప్పాలి - శివ పరమాత్మయే నిరాకారుడు, జ్ఞానసాగరుడు మరియు శివ జయంతియే గీతా జయంతి. ఈ విషయంపై నాటకాన్ని తయారుచేయాలి, తద్వారా మనుష్యుల బుద్ధి నుండి శ్రీకృష్ణుడి విషయము వెళ్ళిపోవాలి. నిరాకారుడైన శివ పరమాత్ముడినే పతిత-పావనుడు అని అంటారు. శాస్త్రాలు మొదలైనవి ఏవైతే తయారయ్యాయో, వాటిని మనుష్య మతాలపై మనుష్యులే తయారుచేసారు. బాబా యొక్క శాస్త్రమంటూ ఏదీ లేదు. బాబా అంటారు - నేను సమ్ముఖముగా వచ్చి పిల్లలైన మిమ్మల్ని బికారుల నుండి యువరాజులుగా తయారుచేస్తాను, ఆ తర్వాత నేను వెళ్ళిపోతాను. ఈ జ్ఞానాన్ని నేనే సమ్ముఖముగా వినిపించగలుగుతాను. ఆ గీతను వినిపించేవారు గీతను వినిపించినా కానీ అక్కడ భగవంతుడు సమ్ముఖముగానైతే లేరు. గీతా భగవంతుడు సమ్ముఖముగా ఉండేవారని, వారు స్వర్గాన్ని తయారుచేసి వెళ్ళిపోయారని అంటారు. మరి ఆ గీతను వినడం ద్వారా మనుష్యులెవరైనా స్వర్గవాసులుగా

అవ్వగలరా? మరణించే సమయంలో కూడా మనుష్యులకు గీతను వినిపిస్తారు, అలా ఇంకే శాస్త్రాన్ని వినిపించరు. గీత ద్వారా స్వర్గ స్థాపన జరిగిందని భావిస్తారు కావున గీతనే వినిపిస్తారు. మరి ఆ గీత ఒక్కటే ఉండాలి కదా. ఇతర ధర్మాలన్నీ తర్వాత వచ్చాయి. మీరు స్వర్గవాసులుగా అవుతారని ఇంకెవ్వరూ చెప్పలేరు. అలాగే మనుష్యులకు గంగాజలాన్ని త్రాగిస్తారే కానీ యమునా జలాన్ని త్రాగించరు. గంగా జలానికే మహత్వము ఉంది. ఎంతోమంది వైష్ణవులు గంగానది వద్దకు వెళ్ళి కుండలో నింపుకొని తీసుకొస్తారు. అన్ని రోగాలూ తొలగిపోవాలని అందులో నుండి ఒక్కొక్క చుక్కనూ వేసుకొని త్రాగుతూ ఉంటారు. వాస్తవానికి ఇది జ్ఞానామృతధార, దీని ద్వారా 21 జన్మల కొరకు దుఃఖాలు తొలగిపోతాయి. చైతన్య జ్ఞానగంగలైన మీలో స్నానం చేయడముతో మనుష్యులు స్వర్గవాసులుగా అవుతారు. మరి తప్పకుండా చివరిలో జ్ఞానగంగలు వెలువడి ఉంటారు. ఆ నీటి నదులైతే ఎప్పటినుండో ఉన్నాయి. నీరు త్రాగినంత మాత్రాన ఎవరైనా దేవతలుగా అవుతారా. ఇక్కడ ఎవరైనా కొద్దిగా జ్ఞానం విన్నా సరే స్వర్గానికి హక్కుదారులుగా అవుతారు. మీరు జ్ఞానసాగరుడైన శివబాబా యొక్క జ్ఞానగంగలు. జ్ఞానసాగరుడు, గీతాజ్ఞానదాత ఒక్క శివుడే, శ్రీకృష్ణుడు కాదు. సత్యయుగంలో జ్ఞానాన్ని ఇచ్చేందుకు అక్కడ పతితులెవ్వరూ ఉండరు. ఈ విషయాలన్నింటినీ భగవంతుడే కూర్చొని అర్థం చేయిస్తారు. హే అర్జునా లేక హే సంజయా... అన్న పేర్లు ప్రసిద్ధమయ్యాయి. వారు వ్రాయడంలో చాలా చురుకైనవారు, నిమిత్తమయ్యారు. ఇప్పుడు శివజయంతి వస్తోంది కావున దాని గురించి పెద్ద-పెద్ద అక్షరాలతో వ్రాయాలి. శివుడు నిరాకారుడు, వారిని జ్ఞానసాగరుడు, దయాసాగరుడు అని అంటారు. శ్రీకృష్ణుడిని ఆ విధంగా జ్ఞానసాగరుడు, దయాసాగరుడు అని అనరు. శివ పరమాత్మయే జ్ఞానాన్ని ఇస్తారు, దయ చూపిస్తారు. జ్ఞానాన్ని ఇవ్వడమే దయ చూపించడము. మాస్టారు దయ చూపించి చదివిస్తే, దానితో బ్యారిస్టర్లు, ఇంజనీరులు మొదలైనవారిగా అవుతారు. సత్యయుగంలో దయ యొక్క అవసరం లేదు. కావున మొట్టమొదట నిరూపించి చెప్పాలి - నిరాకారుడైన జ్ఞానసాగరుడైన శివుని జయంతియే గీతా జయంతియా లేక సత్యయుగ సాకార శ్రీకృష్ణ జయంతియే గీతా జయంతియా. ఇది పిల్లలైన మీరు నిరూపించాలి.

సందేశకులు మొదలైనవారెవరైతే వస్తారో, వారెవ్వరూ పావనంగా తయారుచేయరని మీకు తెలుసు. ద్వాపరము నుండి మాయా రాజ్యం ఏర్పడడంతో అందరూ పతితులుగా అయిపోతారు. మళ్ళీ ఎప్పుడైతే విసుగు చెందుతారో, అప్పుడు మేము వెళ్ళిపోవాలి అని కోరుకుంటారు. ఏ ధర్మాలైతే స్థాపించబడతాయో అవే మళ్ళీ వృద్ధి చెందుతాయి. పవిత్రతా బలముతో ధర్మ స్థాపన చేస్తారు, మళ్ళీ అపవిత్రులుగా అవ్వవలసిందే. ముఖ్యమైనవి నాలుగు ధర్మాలు, వాటి ద్వారానే వృద్ధి జరుగుతుంది, శాఖోపశాఖలు వెలువడుతాయి. శివ జయంతి, గీతా జయంతి నిరూపించబడడంతో మిగిలిన శాస్త్రాలన్నీ ఎగిరిపోతాయి ఎందుకంటే అవన్నీ మనుష్యుల ద్వారా తయారుచేయబడ్డవి. వాస్తవానికి భారత్ శాస్త్రము ఒక్క గీతయే. అతి ప్రియమైన తండ్రి ఎంత సహజతరం చేసి అర్థం చేయిస్తారు. వారిది శ్రేష్ఠాతి-శ్రేష్ఠమైన మతము. ఇప్పుడు మీరు ఇది నిరూపించాలి - నిరాకార జ్ఞానసాగర జయంతియే గీతా జయంతియా లేక సత్యయుగ సాకార శ్రీకృష్ణ జయంతియే గీతా జయంతియా? దీని కొరకు పెద్ద కాన్ఫరెన్స్ ను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఈ విషయము నిరూపించబడితే అప్పుడు పండితులందరూ మీ వద్దకు వచ్చి ఈ లక్ష్యాన్ని తీసుకుంటారు. శివ జయంతి నాడు ఏదో ఒకటి చేయాలి కదా. హిందూ మహాసభ వారికి అర్థం చేయించండి, వారిది పెద్ద సంస్థ. సత్యయుగంలో ఆది సనాతన దేవీ-దేవతా ధర్మం ఉంటుంది. అక్కడ సభలు మొదలైనవేవీ లేవు. సభలు సంగమములో ఉన్నాయి. వాస్తవానికి ఆది సనాతన సభ ఈ బ్రాహ్మణులది మరియు పాండవులది అని మొట్టమొదట నిరూపించాలి. పాండవులే విజయాన్ని పొందారు, వారే తర్వాత స్వర్గవాసులుగా అయ్యారు. ఇప్పుడు ఎవ్వరూ ఆది సనాతన దేవీ-దేవతల సభ అని అనలేరు. దేవతలది సభ అని అనరు, అది రాజ్యము. కల్పము యొక్క సంగమములో ఈ సభలు ఉండేవి. అందులో ఒకటేమో పాండవ సభ, దానిని ఆది సనాతన బ్రాహ్మణుల సభ అని అంటారు. ఇది ఎవ్వరికీ తెలియదు. శ్రీకృష్ణుని పేరుతో బ్రాహ్మణులు లేరు. బ్రాహ్మణుల పిలక బ్రహ్మ పేరుతో ఉంది. బ్రహ్మ పేరు ఆధారముగానే మీరు బ్రాహ్మణ సభ అని అంటారు. ఈ విషయాలను అర్థం చేయించేవారు వివేకవంతులై ఉండాలి. ఇందులో జ్ఞానము యొక్క పరాకాష్ఠ కావాలి. నిరాకారుడైన శివుడే గీతాజ్ఞానదాత, దివ్యచక్షు విధాత. ఈ విషయాలన్నింటినీ ధారణ చేసి ఆ తర్వాత కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయండి. మేము నిరూపించి చెప్పగలము అని ఎవరెవరైతే భావిస్తారో, వారు పరస్పరం కలవాలి. యుద్ధ మైదానములో మేజర్లు, కమాండర్లు మొదలైనవారి సభ ఉంటుంది. ఇక్కడ కమాండర్ అని మహారథిని అంటారు. బాబా క్రియేటర్, డైరెక్టర్, వారు స్వర్గాన్ని రచిస్తారు, వారు డైరెక్షన్ ఇస్తున్నారు - మహాసభను తయారుచేయండి మరియు అందులో ఈ విషయము గురించి చర్చించండి. గీతా భగవానుడు నిరూపించబడితే, ఇక వారితో యోగము జోడించాలి అని అందరూ అర్థం చేసుకుంటారు. బాబా అంటారు, నేను మార్గదర్శకునిగా అయి వచ్చాను, మీరు ఎగిరేందుకు యోగ్యులుగానైతే అవ్వండి. మాయ రెక్కలను తెంచేసింది. యోగాన్ని జోడించడం ద్వారా

మీ ఆత్మ పవిత్రముగా అవుతుంది మరియు మీరు ఎగురుతారు. అచ్చా.

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. జ్ఞానామృతధార ద్వారా అందరినీ నిరోగులుగా మరియు స్వర్గవాసులుగా చేసే సేవను చేయాలి. మనుష్యులను దేవతలుగా తయారుచేయాలి. తండ్రి సమానంగా మాస్టర్ దయార్ద్ర హృదయులుగా అవ్వాలి.

2. జ్ఞాన పరాకాష్ఠ ద్వారా వివేకవంతులుగా అయి శివ జయంతియే గీతా జయంతి అని, గీతా జ్ఞానము ద్వారానే శ్రీకృష్ణుని జన్మ జరుగుతుందని శివ జయంతి నాడు నిరూపించాలి.

వరదానము:- దినచర్యలోని ప్రతి కర్మలో యథార్థంగా మరియు యుక్తియుక్తంగా నడుచుకునే పూజ్య, పవిత్ర ఆత్మా భవ

పూజ్య, పవిత్ర ఆత్మల గుర్తు - వారి ప్రతి సంకల్పము, మాట, కర్మ మరియు స్వప్నము యథార్థంగా అనగా యుక్తియుక్తంగా ఉంటాయి. ప్రతి సంకల్పములో అర్థం ఉంటుంది. ఏదో అలా మాట్లాడేసాము, అలా వచ్చేసింది, అలా చేసేసాము, అలా అయిపోయింది అన్నట్లు ఉండకూడదు. పవిత్ర ఆత్మ సదా దినచర్యలోని ప్రతి కర్మలో యథార్థంగా, యుక్తియుక్తంగా ఉంటారు, అందుకే పూజ కూడా వారి ప్రతి కర్మకు జరుగుతుంది అనగా పూర్తి దినచర్యకు జరుగుతుంది. మేల్కొన్నప్పటి నుండి పడుకునేంత వరకు భిన్న-భిన్న కర్మల దర్శనం జరుగుతుంది.

స్లోగన్:- సూర్యవంశీయులుగా అవ్వాలనుకుంటే సదా విజయీ మరియు ఏకరస స్థితిని తయారుచేసుకోండి.